క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన సామర్లకోట మున్సిపల్ కమిషనర్



కలెక్టర్ కృతికా శుక్లాకు మొక్కను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన జె.రామారావు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు మున్సిపల్ కమిషనరేట్‌లో సెక్రటరీగా పని చేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ తల్లి

పెద్దాపురం: మరిడమ్మ తల్లికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.వి.రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు.

బీమా సొమ్ము అందజేత

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు సుబ్బంపేటకు చెందిన సూరాడ అప్పాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పాజీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన వైఎస్సార్ బీమా మొదటి విడత సొమ్ము రూ.10 వేలను శుక్రవారం గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ బాధిత కుటుంబానికి అందజేశారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సూరాడ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉష పాల్గొన్నారు.

ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్

సామర్లకోట: ఈనెల 12వ తేదీ నుంచి ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు ప్రజలు వారి స్థానిక సమస్యలపై 0884–2327326 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

పథకాలపై జెడ్పీటీసీలకు అవగాహన అవసరం



జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ ఇస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ప్రవీణ

సామర్లకోట: ప్రభుత్వ మహిళల కోసం అమలుచేస్తున్న పథకాలపై జెడ్పీటీసీలకు అవగాహన అవసరమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.ప్రవీణ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జెడ్పీటీసీలకు నిర్వహిస్తున్న మూడో బ్యాచ్ శిక్షణకు శుక్రవారం ప్రవీణ ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారంపైనా, వైద్య, ఆరోగ్య శాఖ అంశాలపై డాక్టర్ ప్రసాదకృష్ణ తదితరులు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

రోడ్డుపైనే ఆటోలు.. ప్రయాణికులకు ఇక్కట్లు

కొత్తపల్లి: ఉప్పాడ బీచ్‌రోడ్డ సెంటర్‌లో అడ్డగోలుగా రోడ్డుపైనే ఆటోలను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉప్పాడ–పిఠాపురం, ఉప్పాడ–కాకినాడ, ఉప్పాడ–కోనపాపేట బీచ్‌రోడ్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒక్కసారిగా ఆటోలను అక్కడికక్కడే మలుపులు తిప్పడంతో వెనుక ఉన్న వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు ప్రమాదానికి గురై గాయపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆటో యూనియన్లు ఉన్నా ఏనాడు డ్రైవర్లకు జాగ్రత్తలు చెప్పింది లేదని పలువురు విమర్శిస్తున్నారు. సాయంత్రం వేళల్లో పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులు, పాఠశాల బస్సులు సైతం వెళ్లేందుకు వీలు లేకుండా ఆటోలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెట్ల వేలం వాయిదా

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో వివిధ రకాల 427 చెట్లు కొట్టి తీసుకువెళ్లడానికి నిర్వహించాల్సిన బహిరంగ వేలం వాయిదా పడింది. వేలంలో 45 మంది డిపాజిట్లు చెల్లించినా పాటలో పాల్గొనక పోవడంతో ఈ నెల 16వ తేదీకి వేలం వాయిదా వేసినట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు.

స్వగృహమస్తు..

ఏళ్లు గడిచాయి.. పాలకులు మారారు.. ప్రభుత్వాలు మారాయి..కాని పేదల బతుకులు మాత్రం మారలేదు. ఇప్పటివరకూ పూరి గుడిసెల్లో ఎండకు ఎండి, వానకు తడిసి వంట చేసుకునేందుకు కూడా నీడ లేక దేవుడే దిక్కు అంటూ ఎందరో నిరుపేదలు కాలం వెళ్లదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత పేదల బతుకులు మారాయి. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రతీ పేదవాడికి పక్కా ఇల్లు, సొంతింటి కల నెరవేరుస్తానని ఇచ్చిన హామీ అమలు చేస్తుండడంతో నాడు పూరి గుడిసెలు... నేడు పక్కా భవనాలుగా, దళిత కాలనీలు ధనిక కాలనీలుగా మారుతున్నాయి. పేదల సొంతింటి కల నెరవేరడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. – పిఠాపురం

- పూరిళ్ల నుంచి పొదరిళ్లలోకి పేదలు
- ధనిక కాలనీలుగా పేదల ఇళ్లు
- గ్రామాల రూపురేఖలు మారుస్తున్న జగనన్న కాలనీలు



పిఠాపురం మండలం కుమారపురంలో జగనన్న కాలనీ



నేడు నర్సింగపురంలో నిర్మిస్తున్న పక్కా గృహాలు

పిఠాపురం: పిఠాపురం మండలంలో ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన ప్రాంతాలు, పూరి గుడిసెల్లో ఏళ్ల తరబడి మగ్గిపోయిన వారు ప్రస్తుతం పక్కా భవనాల్లో కాపురాలు చేస్తున్నారు. తమ జీవితాల్లో వెలుగు నింపిన ప్రత్యక్ష దైవం మా జగనన్న అంటూ సీఎం చిత్ర పటాన్ని ఇంట్లో పెట్టుకుని పూజించుకుంటున్నారు. జగనన్న కాలనీలతో గ్రామాల రూపు రేఖలు పూర్తిగా మారిపోతున్నాయి.



నాడు అద్దె ఇంట్లో బల్ల జ్యోతి



నేడు పక్కా గృహంలో బల్ల జ్యోతి



నాడు పూరి గుడిసెలో తోలుం లక్ష్మి



నేడు పక్కా గృహంలో తోలుం లోక్ష్మి

పిఠాపురం మండలంలో జగనన్న కాలనీల వివరాలు

గ్రామం	మంజూరైన ఇళ్లు	నిర్మాణంలో ఉన్నవి	పూర్తయినవి
నవఖండ్రవాడ	113	46	30
నర్సింగపురం	102	33	37
కుమారపురం-1	124	33	83
కుమారపురం-2	227	82	61
ఎఫ్‌కే పాలెం	81	27	36
విరవ	115	29	71
మల్లాం	61	57	4
జములపల్లి	60	18	12
బి.కొత్తూరు	28	8	12
వెల్దుర్తి	40	12	23
పి.దొంతమూరు	75	25	28
మొత్తం	1026	614	412

కల నెరవేర్చారు

మేము నిరుపేదలం. అద్దె ఇంట్లో ఉండేవాళ్లము. మా చుట్టుపక్కల వారు పెద్ద పెద్ద భవనాలు కట్టుకుంటుంటే జీవితంలో అలా ఇల్లు కట్టుకోగమా అనుకునే వాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కలలను నిజం చేశారు. స్థలం ఇచ్చారు వెంటనే లోన్ మంజూరు చేశారు. మా ఓపిక ఉన్నంతలో అందరిలాగే ఆకర్షణీమైన ఇల్లు కట్టుకున్నాం. కట్టెల పొయ్యిపై వంట చేసే నేను ఇప్పుడు అధునాతన వంట గదిలో వంట చేస్తున్నాను. ఇచ్చింది సెంటున్నర భూమి అయినా ఒక బెడ్‌రూం, కిచెన్, హాల్ ఇలా అన్ని వసతులతో ఇల్లు కట్టుకున్నాం. నేను, నాభర్త ఇద్దరు పిల్లలు కొత్త భవనంలో అడుగు పెట్టిన క్షణాల్లో సీఎం జగన్ మాకు దేవుడిలా కనిపించారు.

బల్ల జ్యోతి, జగనన్న కాలనీ, నర్సింగపురం, పిఠాపురం మండలం



నర్సింగపురంలో తన ఇంట్లో సీఎం వైఎస్ జగన్ ఫోటో పెట్టుకున్న లబ్ధిదారు

సీఎం జగన్‌నే మా దేవుడు

గత 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాము. ఎన్ని సార్లు అర్జీలు పెట్టుకున్నా ఇళ్ల స్థలం మంజూరు కాలేదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకున్నాం. మా జన్మలో సొంత ఇంట్లోకి వెళతామని ఎప్పుడూ అనుకోలేదు. అలాంటిది ఇప్పుడు సొంతింట్లో ఉంటున్నాం. అదంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతోనే. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేశాం. కాని అర సెంటు కూడా ఇవ్వలేదు. ఇప్పుడు నా కొడుకు సీఎం జగన్ ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తే ఆ భూమిని శ్మశానంగా చెప్పడం చంద్రబాబు చేతగాని తనానికి నిదర్శనం. మేము ఎవ్వరి దగ్గరకు తిరగలేదు. వలంటీర్ మా ఇంటికి వచ్చి మాకు ఇల్లు లేదని రాసుకున్నాడు. తర్వాత మాకు ఇళ్ల స్థలం వచ్చిందని చెప్పాడు. పట్టా తెచ్చి మా ఇంటికే ఇచ్చాడు. అధికారులు వచ్చారు. మెటీరియల్ ఇచ్చారు. దగ్గరుండి ఇల్లు కట్టించారు.

తోలుం లక్ష్మి, జగనన్న కాలనీ, నర్సింగపురం, పిఠాపురం మండలం

80 శాతం ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి



పిఠాపురం మండలంలో 1026 లబ్ధిదారులను ఎంపిక చేయగా అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఇప్పటి వరకూ 614 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. వాటిలో ఇప్పటికి 412 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడంతో గృహ ప్రవేశాలు చేశారు. మిగిలిన ఇళ్లను శరవేగంగా పూర్తి చేసే పనిలో లబ్ధిదారులు ఉన్నారు. అన్ని గ్రామాల్లో కాలనీల నిర్మాణాలతో కొత్త గ్రామాలు రూపుదిద్దుకుంటున్నాయి. 80 శాతం నిర్మాణాలు చేపట్టడంతో జిల్లాలో జగనన్న కాలనీల నిర్మాణంలో పిఠాపురం మండలం ప్రథమ స్థానంలో ఉంది. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు కృషి చేశారు.

సత్యనారాయణ, గృహనిర్మాణశాఖ ఏఈ, పిఠాపురం మండలం

ఆలయాల అభివృద్ధికి చర్యలు



సకలేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: నియోజకవర్గంలో దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఆలయాలతో పాటు గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురంలోని కామేశ్వరి బాలాత్రిపుర సుందరీ సమేత సకలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సీహెచ్ రమణమూర్తి, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, ముమ్మిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సాగుకు రైతులను సిద్ధం చేయండి

జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్

పిఠాపురం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నారుమళ్లు ఇప్పటి నుంచే వేసుకునేలా రైతులను సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. పిఠాపురం ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం సబ్ డివిజన్ స్థాయి పంటల సాగు ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది దిగుబడులు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక దిగుడబడులు వచ్చే హైబ్రీడ్ వంగడాలను సాగు చేసేలా రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు.

ముందుగా నారుమళ్లు వేస్తే మేలే

ముందుగానే నారుమళ్లు వేసుకోవడం వల్ల పంట అక్టోబర్ నెలలో చేతికందే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ ఏర్పడుతుందన్నారు. ఆలస్యంగా నారుమళ్లు వేస్తే అధిక వర్షాలు, తుపాన్లు వచ్చే సమయానికి పంట చివరి దశకు చేరుకుని నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్న విషయాన్ని రైతులకు వివరించాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి వారికి సాగుపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. విత్తనాలు అధిక రేట్లకు అమ్మకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి రైతు విత్తనశుద్ధి చేసేలా చూడాలన్నారు. ప్రతి కౌలు రైతు సీసీఆర్‌సీ కార్డు పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఆర్‌సీ డీడీఏబీవీఎస్ హరి, కాకినాడ బీసీఎల్ ఏడీఏ పి.రత్నప్రశాంతి, పిఠాపురం ఏడీఏ పి.స్వాతి, నియోజకవర్గ వ్యవసాయశాఖాధికారులు కేవీవీ సత్యనారాయణ, అరుణ, జోగిరాజు, అచ్యుతరావు, డి.సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో జాతర జరపండి



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న మరిడమ్మ జాతర ఉత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక మరిడమ్మ అమ్మవారి కాలక్షేప మండపంలో శుక్రవారం జాతర ఏర్పాట్లుపై రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, ఆర్టీసీ, మున్సిపల్, వైద్యశాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అవసరం అన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, దేవదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని, అలాగే పారిశుధ్య పనులు పకడ్బందీగా ఉండాలని సూచించారు. ఈఓ రామ్మోహరావు మాట్లాడుతూ 17న జాగరణ ఉత్సవం తరువాత 18 నుంచి జూలై 25వ తేదీ వరకు 37 రోజుల పాటు జాగరణ ఉత్సవాలు ఉంటాయన్నారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, సీఐ అబ్దుల్ నబీ, ఎస్‌ఐ వెలుగుల సురేష్, తహసీల్దార్ జితేంద్ర, ఏరియా ఆసుపత్రి వైద్యులు సుదీప్తి, ఎలక్ట్రికల్ డీఈ రామచంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ రహితంగా పథకాల అమలు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- కొండపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాన్ని వివరిస్తున్న దవులూరి

పెద్దాపురం : రాష్ట్రంలో పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొండపల్లి గ్రామంలో సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, సొసైటీ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు, కేశారపు అయ్యన్న, పోకనాటి దుర్గారావు, ధనయ్యలతో కలిసి ఇంటింటికీ సందర్శించి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

- ప్రజలకు ప్రభుత్వానికి వారు వారధులు
- ఉత్తమ సేవకులకు దవులూరి సత్కారం



వేట్లపాలెంలో వలంటీర్‌ను సత్కరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా వలంటీర్లు పనిచేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం వేట్లపాలెం జెడ్పీ హైస్కూలు ఆవరణలో వలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కోవిడ్ కాలంలో, తదనంతర కాలంలో వారి సేవలు అనన్య సామాన్యమని అభినందించారు. వారి సేవలకు గుర్తుగా ఏటా వారిని సత్కరించాలని సీఎం జగన్ నిర్ణయించారని అన్నారు. సచివాలయ కార్యదర్శులకు ఇచ్చిన మాట ప్రకారం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఇటువంటి సీఎంను దీర్ఘకాలం ఎన్నుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.లలిత, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్, సీనియర్ పార్టీ నాయకుడు గోలి బాబ్జీ, నిడదవోలు రాంబాబు, గ్రామ ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

12న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో 12వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అషిక్ టెక్నో సొల్యూషన్స్ కంపెనీలో డేటా ఎంట్రీ, వీడియో ట్రాఫిక్, సర్వే వీడియో కౌంట్, ఐడీఎఫ్‌సీ బ్యాంకులో సేల్స్ ఆఫీసర్, యాక్సస్ బ్యాంకులో బీడీఇ, సేల్స్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్స్, జియో ఫైబర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, డిక్సాన్ కంపెనీలో టెక్నీషియన్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రెనీ, సియాన్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేలు నుంచి రూ. 25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 12వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో హాజరుకావచ్చని పీడీ తెలిపారు.

నిప్పల వర్షం కురుస్తున్నట్టు..



నిర్మానుష్యంగా ఉన్న పోలీసు రింగ్ సెంటర్

సామర్లకోట: ఉష్ణోగ్రతలు అంతకంతకూ తారాస్థాయికి చెలరేగిపోతున్నాయి. శుక్రవారం సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో 43 డిగ్రీలు నమోదయ్యాయి. నిప్పుల వర్షం కురుస్తున్నట్టుగా ప్రజలు భావిస్తున్నారు. ఎండలు ఈ స్థాయిలో ఉండడంతో ఈనెల 12 నుంచి తెరవాల్సిన పాఠశాలలను వాయిదా వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక మెహర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చెలరేగిన మంటలను సిబ్బంది సకాలంలో నియంత్రించి పెనుప్రమాదాన్ని తప్పించారు. అధిక లోడ్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు సిబ్బంది చెప్తున్నారు. ప్రమాదస్థలికి సమీపంలోనే బ్యాంకుతో పాటు కల్యాణ మండపం, వ్యాపార సంస్థలు ఉన్నాయి. మంటలు వస్తున్న విషయాన్ని గమనించిన వ్యాపారులు తమ దుకాణాలను మూసి వేశారు.

హానికారక మొక్కలు తొలగించాలి

సామర్లకోట: పట్టణంలో కోనో కార్పస్ విడుదల చేసే మొక్కలను సత్వరం తొలగించాలని ఆల్ ఇండియా మాదిగ అభివృద్ధి సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కాపవరపు కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె రామారావుకు వినతిపత్రం అందజేసిన్నట్లు తెలిపారు.

రైల్వే అధికారులకు అభినందనలు



అధికారులను అభినందించిన స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో స్టేషన్ సూపరింటెండెంట్‌గా పని చేసిన కె సీతారామస్వామి గొల్లప్రోలు స్టేషన్ సూపరింటెండెంట్‌గా, ఎ.కోటేశ్వరరావు గొల్లప్రోలు స్టేషన్ మాస్టర్‌గా బదిలీ అయ్యారు. వారిని శుక్రవారం రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అభినందించారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన వారికి స్వాగతం పలికారు. సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్‌గా జీకేఎస్ శ్రీదేవి చాగల్లు నుంచి, పి.అనంతలక్ష్మి కాకినాడ నుంచి బదిలీపై వచ్చి సామర్లకోటలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే స్టేషన్ సూపరింటెండెంట్‌గా బి.శ్రీధర్ పని చేస్తున్నారు. రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కేవీవీ వెంకటేశ్వరరావు తదితరులు

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు రమేష్, చిట్టెం వాసు, నగేష్, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.